
సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా
శనివారం। 31। ఆగస్టు। 2024



టన్ను చీనీ రూ.22 వేలు

అనంతపురం వ్యవసాయ మార్కెట్‌యార్డులో శుక్రవారం టన్ను చీనీకాయలు గరిష్టంగా రూ.22 వేలు పలికాయి. మార్కెట్‌కు 111 టన్నుల చీనీకాయలు అమ్మకానికి వచ్చాయి.



టమాట కిలో రూ.20

అనంతపురం కక్కలపల్లి మండీలో శుక్రవారం కిలో టమాట గరిష్టంగా రూ.20, కనిష్టం రూ.5.50, సరాసరిన రూ.14 ప్రకారం ధర పలికింది.

గరిష్టం/కనిష్టం
32.9°/23.5°

జిల్లా పరిధిలో శుక్రవారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. ఆకాశం పాక్షికంగా మేఘావృతమై అక్కడక్కడా తేలికపాటి వర్షం కురిసింది. గంటకు 6 నుంచి 10 కి.మీ వేగంతో నైరుతి దిశగా గాలి వీచింది.

న్యూస్‌రీల్

జిల్లా ప్రత్యేక అధికారిగా యువరాజ్

- 'అనంత'కు కాంతిలాల్ దండే

సాక్షి, పుట్టపర్తి: జిల్లా ప్రత్యేక అధికారిగా పరిశ్రమల శాఖ కార్యదర్శి ఎస్.యువరాజ్‌ను రాష్ట్ర ప్రభుత్వం నియమించింది. వివిధ జిల్లాలకు ప్రత్యేక అధికారులను నియమిస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్‌కుమార్ ప్రసాద్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ క్రమంలో జిల్లాకు యువరాజ్‌ను, అనంతపురం జిల్లాకు ప్రత్యేక అధికారిగా రవాణా, రోడ్లు భవనాల శాఖ ముఖ్య కార్యదర్శి కాంతిలాల్ దండేను నియమించారు.

అడిషనల్ ఎస్పీగా ఆర్ల శ్రీనివాసులు



ఆర్ల శ్రీనివాసులు

పుట్టపర్తి టౌన్: జిల్లా అడిషనల్ ఎస్పీగా ఆర్ల శ్రీనివాసులు నియమితులయ్యారు. పెనుకొండ డీఎస్పీగా పని చేస్తున్న ఆయనకు ప్రభుత్వం పదోన్నతి కల్పించి అడిషనల్ ఎస్పీగా నియమించింది. ఈమేరకు డీజీపీ ద్వారకా తిరుమలరావు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం ఇక్కడ అడిషనల్ ఎస్పీగా ఉన్న విష్ణును ఏసీబీ అడిషనల్ ఎస్పీగా బదిలీ చేశారు. ఆర్ల శ్రీనివాసులు ఎస్ఐగా, సీఐగా, డీఎస్పీగా ఉమ్మడి అనంతపురం జిల్లాలో పనిచేశారు. నెలరోజుల కిందటే ఆయన్ను ప్రభుత్వం నెల్లూరు నుంచి పెనుకొండ డీఎస్పీగా బదిలీ చేసింది. తాజాగా ఏఎస్పీగా నియమించి జిల్లాలోనే పోస్టింగ్ ఇచ్చింది.

పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి కృషి



ఫిర్యాదులు స్వీకరిస్తున్న జిల్లా ఖజానా అధికారి నాగమల్లిక

పుట్టపర్తి అర్బన్: జిల్లాలోని పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి తమవంతు కృషి చేస్తున్నామని జిల్లా ఖజానా అధికారి నాగమల్లిక తెలిపారు. శుక్రవారం ఆమె ప్రశాంతి గ్రామంలోని ఖజానా కార్యాలయంలో పెన్షనర్లతో సమావేశం నిర్వహించారు. అనంతరం వారి నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా ఖజానా అధికారి నాగమల్లిక మాట్లాడుతూ, ప్రతి నెలా 30వ తేదీ ఉదయం, మధ్యాహ్నం పెన్షనర్లతో సమావేశాలు నిర్వహిస్తామన్నారు. పెన్షనర్లకు ఏదైనా సమస్య ఉంటే నేరుగా తమ దృష్టికి తీసుకురావచ్చన్నారు. కార్యక్రమంలో ఎస్‌టీఓ ప్రసాద్, జిల్లా పెన్షనర్ల సంఘం అధ్యక్షుడు రామకృష్ణయ్య, సెక్రెటరీ నాగార్జున శెట్టి తదితరులు పాల్గొన్నారు.

12 మండలాల్లో వర్షం



పుట్టపర్తి అర్బన్: మారిన వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో గురువారం రాత్రి నుంచి శుక్రవారం ఉదయం వరకు జిల్లాలోని 12 మండలాల పరిధిలో ఓ మోస్తరు వర్షం కురిసినట్లు వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. అత్యధికంగా నల్లమాడ మండలంలో 24.2 మి.మీ వర్షపాతం నమోదైనట్లు తెలిపారు. ఇక ఎన్పీకుంట 16.0 మి.మీ, గాండ్లపెంట 14, లేపాక్షిలో 12.4, పరిగి 11.4, కదిరి 8.2, పుట్టపర్తి 8.2, నల్లచెరువు 6.4, ఓడీచెరువు 5.2, రొళ్ల 4.4, హిందూపురం 3.6, రామగిరి మండలంలో 2.0 మి.మీ వర్షపాతం నమోదైనట్లు వెల్లడించారు.

'రెడ్‌క్రాస్' కోసం స్థల పరిశీలన

గోరంట్ల: జిల్లాలో రెడ్‌క్రాస్ సొసైటీ కార్యాలయ భవన నిర్మాణం కోసం కలెక్టర్ టీఎస్ చేతన్ స్థల పరిశీలన చేశారు. మండల పరిధిలోని పాలసముద్రం సమీపంలోని సర్వే నంబర్ 130–3లో 50 సెంట్ల స్థలాన్ని రెడ్‌క్రాస్ భవన నిర్మాణం కోసం రెవెన్యూ అధికారులు ఇది వరకే గుర్తించారు. దీంతో శుక్రవారం కలెక్టర్ చేతన్, రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవితతో కలిసి అధికారులు గుర్తించిన స్థలాన్ని పరిశీలించారు. భవన నిర్మాణం కోసం స్థలం అనువుగా ఉంటుందా అని ఆరా తీశారు. వారి వెంట డిప్యూటీ తహసీల్దార్ రెడ్డిశేఖర్, ఆర్ఐ సోముశేఖరరెడ్డి, రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

గురువుపై మరుగు బరువు

నేను హెచ్‌ఎం అయినా పిల్లలకు పాఠాలు చెప్పాల్సిందే. అదిపోనూ పాఠశాల నిర్వహణ బాధ్యతలు నావే. ఇక సమావేశాలు సరేసరి. తాజాగా ప్రభుత్వం పాఠశాలలోని మరుగుదొడ్ల ఫొటోలు తీసి 13 కాలమ్స్ నింపి యాప్‌లో అప్‌లోడ్ చేసే బాధ్యత మాపై ఉంచింది. నేను పాఠాలు చెప్పేదా...పాఠశాల నిర్వహణ చూసుకునేదా..ఈ యాప్‌లలో సమాచారం నమోదు చేసేదా..? రోజురోజుకూ మానసిక ఒత్తిడి పెరిగిపోతోంది.

– ఓడీసీ మండలంలోని ఓ పాఠశాల ప్రధానోపాధ్యాయుడి ఆవేదన ఇది.

పాఠశాల తల్లిదండ్రుల కమిటీ చైర్మన్‌గా గతంలో అవతలిపార్టీ వారు ఉన్నారు. ఇప్పుడు మా ప్రభుత్వం వచ్చింది కదా..అందుకే అందరూ బలవంతం చేస్తే చైర్మన్‌గా ఉండేందుకు ఒప్పుకున్నా. ఇప్పుడు వారంలో రెండురోజులు స్కూల్‌కు వెళ్లి మరుగుదొడ్ల ఫొటోలు తీయమంటే మాతో అయ్యే పనేనా.. మాలాంటి వాళ్లతో ఆ పనులు చేయిస్తారా..

– హిందూపురం మండలంలోని ఓ ఉన్నత పాఠశాల ఎస్ఎంసీ చైర్మన్ మాటలివి.



మరుగుదొడ్ల శుభ్రతను పరిశీలిస్తున్న ఉపాధ్యాయురాలు (ఫైల్)

- మరుగుదొడ్ల పర్యవేక్షణ బాధ్యత హెచ్‌ఎంలదే
- రోజూ 13 కాలమ్స్ నింపి యాప్‌లో అప్‌లోడ్ చేయాల్సిందే
- ఉత్తర్వులు జారీ చేసిన కూటమి సర్కారు
- యాప్‌లపై ప్రభుత్వ ఉపాధ్యాయుల ఆవేదన

1,159	జిల్లాలోని ప్రాథమిక పాఠశాలలు
230	ప్రాథమికోన్నత పాఠశాలలు
307	ఉన్నత పాఠశాలలు
1,42,327	1-10వ తరగతి వరకు విద్యార్థుల సంఖ్య

కదిరి: ప్రభుత్వ పాఠశాలల్లో మరుగుదొడ్ల పర్యవేక్షణ బాధ్యతను ఉన్నతాధికారులు ఆయా పాఠశాలల హెచ్‌ఎంలపై వేశారు. రోజుకు నాలుగు సార్లు మరుగుదొడ్లను పరిశీలించి అందుకు సంబంధించిన పూర్తి వివరాలు రోజూ ఐఎంఎంఎస్ యాప్‌లో అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. ఈ మేరకు కూటమి ప్రభుత్వం ఇటీవల ఉత్తర్వులు జారీ చేసింది. గత ప్రభుత్వ హయాంలో పాఠశాల హెచ్‌ఎంలు కేవలం పాఠశాలలోని ఆయాలు శుభ్రం చేసిన టాయిలెట్స్ ఫొటో తీసి గుడ్ లేదా బ్యాడ్ అని కామెంట్ చేసి అప్‌లోడ్ చేసేవారు. ఇప్పుడు రోజూ 13 కాలమ్స్‌తో..30 సబ్ కాలమ్స్‌తో కూడిన ఫామ్ నింపి అప్‌లోడ్ చేయాల్సి ఉంటుంది. దీంతో తమ పరిస్థితి 'పెనం మీద నుంచి పొయ్యిలో పడట్టుంది' అని పలువురు హెచ్‌ఎంలు బాధపడుతున్నారు. 'గతంలోనే బాగుండేది. కేవలం ఫొటో తీసి పంపితే సరిపోయేది. ఈ ప్రభుత్వం వచ్చాక మరింత పనిభారం పెరిగింది..' అంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కత్తిమీద సామే

ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ (ఎస్ఎంసీ) చైర్మన్ ప్రతి బుధ, శుక్రవారాల్లో, అలాగే గ్రామ సచివాలయంలో పని చేసే ఎడ్యుకేషన్ వెల్ఫేర్ అసిస్టెంట్ ప్రతి మంగళ, గురువారాల్లో బడికి వెళ్లి అక్కడున్న మరుగుదొడ్ల ఫొటోలు తీసి యాప్ ద్వారా అప్‌లోడ్ చేయాలి. ఎస్ఎంసీ చైర్మన్లు మరుగుదొడ్ల ఫొటోలు తీసి యాప్ ద్వారా అప్‌లోడ్ చేయడం సాధ్యమేనా?.. ఆ దృశ్యాలను పరిశీలించి రోజూ సాయంత్రం 3 నుంచి 3.30 గంటల మధ్య యాప్ ద్వారా 13 కాలమ్స్‌తో కూడిన ఫామ్ అప్‌లోడ్ చేయడం హెచ్‌ఎంలకు పనిభారంతో పాటు కత్తిమీద సామే అని టీచర్లు వాపోతున్నారు. నెలకు ఒకసారి బడికి వచ్చి పాఠశాల అభివృద్ధి కోసం రూపొందించుకున్న తీర్మానాల కాపీలపై సంతకాలు చేసేందుకే తమకు తీరిక లేదని ఎస్ఎంసీ చైర్మన్లు చెబుతారు. అలాంటిది వారు మరుగుదొడ్ల ఫొటోలను తీసి యాప్‌లో అప్‌లోడ్ చేయడం సాధ్యమేనా అని ఉపాధ్యాయులు చర్చించుకుంటున్నారు. సచివాలయ ఉద్యోగులు సైతం పాఠశాలలో మరుగుదొడ్ల ఫొటోలు తీసే బాధ్యతలు తమకు వద్దే వద్దు..అంటూ ఇప్పటికే తమ అభిప్రాయాన్ని బాహాటంగా వెలిబుచ్చారు.

'మరుగు'న పడిపోతాయ్..

గత ప్రభుత్వం బోధనపైనే కాకుండా మధ్యాహ్న భోజనం, పాఠ్య పుస్తకాలు, పిల్లలు ధరించే దుస్తులు, బూట్లు ఇలాంటి అన్నింటితో పాటు బడిలో మరుగుదొడ్ల పరిశుభ్రతపై కూడా ప్రత్యేక దృష్టి సారించేది. కానీ ఈ ప్రభుత్వం అందుకు భిన్నంగా వ్యవహరిస్తోంది. సర్కారు బడులను నిర్వీర్యం చేసే దిశగానే అడుగులు వేస్తోంది. 'తల్లికి వందనం' పేరుతో ప్రతి విద్యార్థికి రూ.15 వేల చొప్పున ఇస్తామన్న నగదు ఇంత వరకూ తల్లుల ఖాతాల్లో జమ చేయలేదు. ఇప్పుడు మరుగుదొడ్ల ఫొటోలు తీసే బాధ్యత పాఠశాల యాజమాన్య కమిటీ చైర్మన్లకు అప్పగించిందంటే సర్కారు బడులపై ఈ ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధి ఏమిటో అర్థమవుతోందని విద్యార్థుల తల్లిదండ్రులు మండిపడుతున్నారు.

శుభ్రపరిచేదెలా?

బడిలో మరుగుదొడ్లు శుభ్రం చేయాలంటే యాసిడ్, ఫినాయిల్, డెటాల్‌తో పాటు బ్రష్‌లు, చీపుర్లు అవసరం. వీటి కోసం ప్రభుత్వం ఇప్పటి దాకా ఒక్క రూపాయి కూడా మంజూరు చేయలేదు. అయితే మరుగుదొడ్ల ఫొటోలు తీయడం, యాప్ ద్వారా వాటి పూర్తి వివరాలు రోజూ అప్‌లోడ్ చేయాలని మాత్రం ఉత్తర్వులు జారీ చేసిందని టీచర్లు ఆగ్రహంతో ఉన్నారు.

ఫొటోలు తీయకుంటే చర్యలుంటాయా?

తమకు కేటాయించిన రోజుల్లో పాఠశాలల్లోని మరుగుదొడ్ల ఫొటోలు తీసి యాప్‌లో అప్‌లోడ్ చేయకుంటే ఎస్ఎంసీ చైర్మన్లపైన, సచివాలయ ఎడ్యుకేషన్ వెల్ఫేర్ అసిస్టెంట్లపైన ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందా? అని ఉపాధ్యాయులతో పాటు విద్యార్థుల తల్లిదండ్రులు ప్రశ్నిస్తున్నారు.

బోధనేతర పనులు వద్దు



టీచర్లను బోధనేతర పనుల నుంచి మినహాయిస్తామని ఎన్నికలకు ముందు చంద్రబాబుతో పాటు కూటమి నేతలు పదే పదే చెప్పారు. ఆ మాటకు ప్రభుత్వం కట్టుబడి ఉండాలి. మరుగుదొడ్లకు సంబంధించి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం సరైంది కాదు. టీచర్లకు యాప్స్ భారం తగ్గిస్తామని చెప్పి... మరింత భారం పెడుతోంది. వీటి వల్ల ఉపాధ్యాయులు మానసిక ఒత్తిడికి గురవుతున్నారు.

– వీవీ రమణారెడ్డి, జిల్లా అధ్యక్షుడు, వైఎస్సార్‌టీఏ

పునరాలోచించాలి



మరుగుదొడ్ల విషయంలో ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై పునరాలోచించుకోవాలి. హెచ్‌ఎంలకు ఇప్పటికే చాలా బాధ్యతలు ఇచ్చారు. మరుగుదొడ్ల పరిశీలన వివరాల నమోదు మరింత భారం కానుంది. ఎస్ఎంసీ చైర్మన్లు, సచివాలయ సిబ్బందికి పాఠశాల మరుగుదొడ్ల ఫొటోలు తీసి అప్‌లోడ్ తీసే బాధ్యత ఇస్తే... అది అమలు సాధ్యమేనా? అనాలోచిత నిర్ణయాలతో అందరికీ ఇబ్బందే.

– హరిప్రసాద్‌రెడ్డి, జిల్లా అధ్యక్షుడు, ఎస్టీయూ

ఆ బాధ్యత హెచ్‌ఎంలదే



రోజూ పాఠశాలల్లో మరుగుదొడ్లకు సంబంధించి ఐఎంఎంఎస్ యాప్ ద్వారా సూచించిన కాలమ్స్ అన్నీ నింపి అప్‌లోడ్ చేయాలి. ఈ బాధ్యత పూర్తిగా హెచ్‌ఎంలదే. వారంలో రెండు రోజులు ఎస్ఎంసీ చైర్మన్ లేదా వైస్ చైర్మన్లు, మరో రెండు రోజులు సచివాలయ ఎడ్యుకేషన్ వెల్ఫేర్ అసిస్టెంట్లు బడిలోని మరుగుదొడ్లను పర్యవేక్షించి అందుకు సంబంధించిన ఫొటోలు అప్‌లోడ్ చేయాలని ప్రభుత్వం ఆదేశించింది.

– మీనాక్షి, జిల్లా విద్యాశాఖ అధికారి

వీటిమూలంగా చివరకు హెచ్‌ఎంలు, ఎస్ఎంసీ చైర్మన్ల మధ్య గొడవలకు దారి తీసే పరిస్థితులు వస్తాయంటున్నారు.

జిల్లాలో పలువురు ఎస్ఐల బదిలీ



పుట్టపర్తి టౌన్: జిల్లా వ్యాప్తంగా పలువురు సబ్‌ఇన్‌స్పెక్టర్లు(ఎస్ఐలు) బదిలీ అయ్యారు. ఈ మేరకు అనంతపురం రేంజ్ డీఐజీ షిమోషి శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఎన్నికల అనంతరం సాధారణ బదిలీల్లో భాగంగా పలువురికి పోస్టింగ్‌లు ఇచ్చారు. సీకేపల్లిలో ఉన్న పి.వెంకటేశ్వర్లును పెనుకొండకు, పట్నంలో ఉన్న కె.నరసింహులును తలుపులకు, అక్కడ ఉన్న జి.దిలీప్‌కుమార్‌ను వీఆర్ (పుట్టపర్తి)కు, లేపాక్షిలో ఉన్న కె.గోపిని తనకల్లుకు, అక్కడ ఉన్న కె.ధరణిబాబును వీఆర్ (పుట్టపర్తి)కు, హిందూపురం టూటౌన్‌లో ఉన్న ఎం.వెంకటరమణయ్యను సీసీఎస్‌కు బదిలీ చేశారు.

వీఆర్‌లో ఉన్న పలువురికి స్థానాలు..

ఇక వీఆర్‌లో ఉన్న ఎస్ఐలకు పోస్టింగ్‌లు ఇచ్చారు. జి.బాలరాజును ఎస్‌బీకి, కె.ఎల్.కళావతిని పుట్టపర్తిలోని మహిళా పీఎస్‌కు, కె.ఆంజనేయప్రసాద్‌ను ఎయిర్‌పోర్టు సీఎస్(పుట్టపర్తి)కు, పి.వెంకటరమణను ప్రశాంతినిలయం పీఎస్‌కు, ఎస్.ఎ.రఫీక్‌ను సీసీఎస్‌కు, కె.శివకుమార్‌ను పుట్టపర్తిలోని మహిళా పీఎస్‌కు, ఎస్.వెంకటరాముడును పుట్టపర్తి మహిళా పీఎస్‌కు, ఎస్.మహమ్మద్‌రఫీని హిందూపురం ట్రాఫిక్‌కు, జి.ఇక్బాల్‌ను డీసీఆర్‌బీకి, కె.రెడ్డెప్పను సీసీఎస్‌కు, సి.బాబును సీసీఎస్‌కు, ఎస్.అబ్దుల్ కలామ్ అజాద్‌ను హిందూపురం మహిళా పీఎస్‌కు, జి.వెంకటరమణను పుట్టపర్తి మహిళా పీఎస్‌కు, పి.వి జయనాయక్‌ను పుట్టపర్తి మహిళా పీఎస్‌కు, డి.శేషగిరిని పీసీఆర్‌కు బదిలీ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

నేటి నుంచి దులీప్ ట్రోఫీ పాస్‌ల జారీ



ఆర్డీటీ స్పోర్ట్స్ సెంటర్‌లో పాస్‌ల జారీ కౌంటర్

అనంతపురం కార్పొరేషన్: దులీప్ ట్రోఫీ క్రికెట్ మ్యాచ్‌ల వీక్షణ కోసం శనివారం ఉదయం 11 గంటల నుంచి ఆర్డీటీ స్పోర్ట్స్ సెంటర్‌లో ఎంట్రీ పాస్‌లు జారీ చేయనున్నట్లు ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ (ఏసీఏ) త్రీ మెన్ కమిటీ సభ్యులు మాంఛో ఫెర్రర్ తెలిపారు. ఈ మేరకు ఆయన శుక్రవారం ఓ ప్రకటన విడుదల చేశారు. ఒక కౌంటర్ ద్వారా రోజూ 4వేల పాసులు జారీ చేస్తామని పేర్కొన్నారు. మ్యాచ్ ప్రారంభమయ్యే రోజు ఉదయం 8.30 నుంచి 10.30 గంటల వరకు మాత్రమే స్టేడియంలోకి అనుమతిస్తామన్నారు.

'పురం' ఆస్పత్రిలో శిశువు మృతి

- ప్రసవ సమయంలో అందుబాటులోలేని వైద్యుడు
- కాన్పు చేసిన నర్సింగ్ సిబ్బంది
- ప్రసవానంతరం శిశువు మృతి
- విచారణకు ఆదేశించిన సూపరింటెండెంట్



హిందూపురం జిల్లా ఆస్పత్రి

హిందూపురం టౌన్: నవమాసాలు గర్భంలో ఉన్న బిడ్డ... తల్లి చూపునకు కూడా నోచుకోలేకపోయింది. కళ్లు తెరవక ముందే కన్ను మూసింది. ఆ మాతృమూర్తికి తీరని శోకం మిగిలింది. ఆడబిడ్డ పుట్టిందని ఆనందంగా ఉన్న ఆ కుటుంబం... బిడ్డ దూరం కావడంతో కన్నీరుమున్నీరైంది. హిందూపురం ఆస్పత్రిలో ప్రసవం అయిన గంటకే శిశువు మృతి చెందగా... కేవలం వైద్యుడి నిర్లక్ష్యం వల్లే తమ బిడ్డ తమకు కాకుండా పోయిందని శిశువు తండ్రి ఆరోపిస్తున్నారు. వివరాల్లోకి వెళితే... హిందూపురానికి చెందిన హుమేరా పురిటి నొప్పులతో గురువారం సాయంత్రం హిందూపురం జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలో చేరింది. పరీక్షించిన వైద్యుడు ఉమ్మనీరు ఎక్కువగా ఉందని... అనంతపురం తీసుకువెళ్లాలని సూచించారు. అయితే హుమేరా బంధువులు మాత్రం ఇక్కడే ప్రసవం చేయాలని కోరారు. ఈ క్రమంలో శుక్రవారం ఉదయం 7 గంటలకు ఆమెకు ప్రసవం చేయగా, ఆడబిడ్డకు జన్మనిచ్చింది. అయితే ఆ సమయంలో వైద్యుడు అందుబాటులో లేకపోవడంతో నర్సింగ్ సిబ్బందే సాధారణ ప్రసవం చేశారు. అనంతరం శిశువు ఆరోగ్య పరిస్థితి ఆందోళనకరంగా ఉండడంతో ఆస్పత్రిలోని మాతాశిశుకేంద్రానికి పంపారు. అక్కడ శిశువు మృతి చెందింది. పరిస్థితి విషమంగా ఉందని తెలిసినా... వైద్యుడు ప్రసవానికి హాజరుకాకపోవడంపై గర్భిణి హుమేరా బంధువులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తమ ఇంట ఆనందాలు పంచాల్సిన బిడ్డ వైద్యుడి నిర్లక్ష్యం వల్లే దూరమైందని, అదే తల్లికి ఏదైనా జరిగి ఉంటే తమ పరిస్థితి ఏమిటని వారు ప్రశ్నించారు. దీనిపై ఉన్నతాధికారులు విచారణకు ఆదేశించాలని కోరుతున్నారు. ఈ ఘటనపై ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రోహిల్ కుమార్‌ను 'సాక్షి' వివరణ కోరగా.. ప్రసవానంతరం శిశువు మృతి చెందిన విషయం వాస్తవమేనన్నారు. దీనిపై డ్యూటీ డాక్టర్‌తో విచారణ చేపట్టినట్లు ఆయన వెల్లడించారు. సమగ్ర నివేదికను ఉన్నతాధికారులకు పంపుతామన్నారు.

జిల్లాలో 7,208 మెట్రిక్ టన్నుల ఇసుక



వీసీలో పాల్గొన్న కలెక్టర్ చేతన్, జేసీ అభిషేక్‌కుమార్

పుట్టపర్తి అర్బన్: ముదిగుబ్బ మండలం కొడవండ్లపల్లిలోని ఇసుక డిపోలో 7,208 మెట్రిక్ టన్నుల ఇసుక నిల్వ ఉన్నట్లు కలెక్టర్ చేతన్ గనులశాఖ ముఖ్య కార్యదర్శి ముఖేష్ కుమార్ మీనాకు తెలిపారు. శుక్రవారం నూతన ఇసుక విధానంపై గనుల శాఖ ముఖ్య కార్యదర్శి ముఖేష్ కుమార్ మీనా అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సెప్టెంబర్ 11వ తేదీ నుంచి ఉచిత ఇసుక విధానం అమలు చేయాలని, అంతా ఆన్‌లైన్ ద్వారా నమోదు చేసుకోవాలని సూచించారు. అనంతరం కలెక్టర్ జిల్లాలోని పరిస్థితిని వివరించారు. ఇప్పటి వరకూ జిల్లాలోని కొడవాండ్లపల్లి డిపో నుంచి 121 లారీల ద్వారా 2,050 మెట్రిక్ టన్నుల ఇసుకను సరఫరా చేశామని తెలిపారు. ఇంకా 7,208 మెట్రిక్ టన్నులు నిల్వ ఉందన్నారు. ప్రభుత్వ భవనాలకు, గృహ నిర్మాణాలకు బత్తలపల్లి మండలంలోని నల్లబోయినపల్లి వద్ద 9,435 మెట్రిక్ టన్నుల ఇసుకను సిద్ధంగా ఉంచామన్నారు. సమావేశంలో జేసీ అభిషేక్‌కుమార్, మైన్స్ ఏజీ రామమోహన్, ఆర్డీఓ కరుణసాగర్‌రెడ్డి, డీపీఓ విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

టీచర్ల 'పని సర్దుబాటు' లీలలు

- అనుకుంటే బయటకు.. లేదంటే అదే స్కూల్లోనే..
- గందరగోళంగా మారిన సర్దుబాటు
- ఎస్జీటీలను బలవంతంగా పంపుతున్న వైనం
- ప్రాథమిక పాఠశాలలకు శాపంగా మారిన ప్రక్రియ
- పలు స్కూళ్లు ఏకోపాధ్యాయ స్కూల్‌గా మారే ప్రమాదం
- ఉమ్మడి జిల్లాలో మండిపడుతున్న ఉపాధ్యాయులు, ఉపాధ్యాయ సంఘాల నాయకులు



అనంతపురం ఎడ్యుకేషన్: ఉపాధ్యాయుల 'పని సర్దుబాటు' ప్రక్రియ ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా తీవ్ర గందరగోళానికి తెర తీస్తోంది. ఈ విద్యా సంవత్సరం కోసం చేపడుతున్న ఈ ప్రక్రియ ప్రహసనంగా మారింది. ప్రాథమిక విద్యకు, ఎస్జీటీలకు తలపోటుగా తయారైంది. ఈ నెల 8న ప్రారంభమైన 'మిగులు టీచర్ల సర్దుబాటు ప్రక్రియ' సాగుతూనే ఉంది. ఎట్టకేలకు మండలస్థాయి సర్దుబాటును మూడు రోజుల కిందట పూర్తి చేశారు. ఇక్కడంతా తప్పుల తడకగా, తూతూమంత్రంగా ముగించేశారు. 'సర్దుబాటు'.. ప్రాథమిక పాఠశాలలకు శాపంగా మారింది. ఉన్నత పాఠశాలల్లో అవసరమైన మేరకు సబ్జెక్టు టీచర్లను నియమించడమే లక్ష్యంగా 117 జీఓను అనుసరించి సర్దుబాటు చేస్తున్నారు. మిగులుగా ఉన్న సబ్జెక్టు టీచర్లను సర్దుబాటు చేస్తే సరిపోతుంది. కానీ ప్రాథమిక పాఠశాలల్లో పని చేస్తున్న ఎస్జీటీలను సబ్జెక్టు మెథడాలజీని బట్టి ఉన్నత పాఠశాలలకు బలవంతంగా సర్దుబాటు చేస్తున్నారు. గతేడాదే ఎస్జీటీలకు పదోన్నతులు కల్పించారు. విల్లింగ్ ఉన్న ప్రతి ఎస్జీటీకీ పదోన్నతి కల్పించి ఉన్నత పాఠశాలలకు కేటాయించారు. ప్రస్తుతం ప్రాథమిక పాఠశాలల్లో పని చేస్తున్న ఎస్జీటీలు వివిధ వ్యక్తిగత కారణాల వల్ల పదోన్నతులు వదులుకుని కొనసాగుతున్నారు. వారినే సబ్జెక్టు టీచర్లుగా ఉన్నత పాఠశాలలకు వెళ్లాలంటూ బలవంతం చేస్తున్నారు. తాము స్కూల్ అసిస్టెంట్‌గా వెళ్లేందుకు నాట్ విల్లింగ్ ఇచ్చామని, ఇప్పుడేమో సబ్జెక్టులు బోధించాలంటూ సర్దుబాటు చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నిస్తున్నారు. ఎస్జీటీలను ఉన్నత పాఠశాలలకు పంపుతుండడతో చాలా స్కూళ్లు ఏకోపాధ్యాయ స్కూళ్లుగా మారుతున్నాయి. భవిష్యత్తులో వీటి ఉనికి ప్రశ్నార్థకం కానుందని ఉపాధ్యాయ సంఘాల నాయకులు వాపోతున్నారు.

సా...గుతోన్న సర్దుబాటు ప్రక్రియ..

వారాల తరబడి సర్దుబాటు ప్రక్రియ సాగుతుండడంతో స్కూళ్లలో బోధనకు ఇబ్బందిగా మారింది. సర్దుబాటులో ఎవరు ఏ స్కూల్‌కు వెళ్లాలో అనే కంగారుతో టీచర్లు చదువుపై దృష్టి పెట్టలేకపోతున్నారు.

తపోవనం స్కూల్‌లో సర్దుబాటు ఏదీ?

అనంతపురం రూరల్ మండలం తపోవనం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఇంగ్లిష్, గణితం సబ్జెక్టుల్లో ఒక్కో టీచరును మిగులుగా చూపించారు. ఇంగ్లిష్ టీచరు తాను సీనియర్‌నంటూ అందుకు సంబంధించి ఆధారాలు చూపించి మినహాయింపు పొందారు. ఈయన కాకుంటే మరోటీచరునైనా బయటకు పంపాలి. అది జరగలేదు. గణితం సబ్జెక్టులోనూ మిగులుగా చూపించిన టీచరు తాను సీనియర్‌నంటూ ఆధారాలను ఉన్నతాధికారులకు చూపించి మినహాయింపు పొందారు. తర్వాతి టీచరును మిగులుగా చూపించి ఏదో ఒక స్కూల్‌కు సర్దుబాటు చేయాల్సి ఉంది. అలా చేయకుండా స్కూల్‌లో ఓ కీలక టీచరు మంత్రాంగం నడిపారు. ప్రత్యేక కేటగిరీ టీచర్లకు మండలస్థాయిలో మినహాయింపు లేదు. డివిజన్ స్థాయిలో ఉంటుంది. పక్కా స్కెచ్ వేసి సదరు టీచరును డివిజనల్ స్థాయిలో మిగులు కింద చూపించారు. ఆమె ప్రత్యేక కేటగిరీకి అర్హురాలు కావడంతో మినహాయింపు పొందారు. ఏది ఏమైనా ఈ స్కూల్ నుంచి ఒక్క టీచరునూ సర్దుబాటు చేయలేదు. రూరల్ మండలం చియ్యేడు ఉన్నత పాఠశాలకు గణితం సబ్జెక్టు టీచరు అవసరం కాగా...రుద్రంపేట ప్రాథమిక పాఠశాల నుంచి ఎస్జీటీని సర్దుబాటు చేశారు. తపోవనం జెడ్పీ స్కూల్‌లో గణితం సబ్జెక్టు టీచరు మిగులుగా ఉన్నా... ఎస్జీటీని పంపడం వెనుక ఉద్దేశం ఏంటో అధికారులకే తెలియాలి.

పెనుకొండలో కొత్త వివాదం..

శ్రీ సత్యసాయి జిల్లా పెనుకొండ మండలంలో కొత్త వివాదం తలెత్తింది. మండల స్థాయి సర్దుబాటులో చూపించని టీచరును ఉన్నతాధికారులు డివిజినల్ స్థాయిలో మిగులుగా చూపించారు. పెనుకొండ పట్టణం దర్జీపేట ఉర్దూ ఉన్నత పాఠశాలలో ఒక తెలుగు టీచరు మిగులుగా ఉన్నారు. మండలంలోనే సీనియర్ కావడంతో ఆయనకు మంచి స్కూల్ దొరుకుతుందనే కారణంగా ఎంఈఓ–2 ఎంట్రీ ఇచ్చి సదరు టీచరును మండలస్థాయిలో మిగులుగా చూపించకుండా వ్యూహం రచించారు. అనంతరం ఇప్పుడు అదే తెలుగు టీచరును డివిజన్ స్థాయిలో అదే ఎంఈఓ–2 మిగులుగా చూపించారు. ఇందుకు బాధ్యులెవరో విద్యాశాఖ ఉన్నతాధికారులే చెప్పాలని ఉపాధ్యాయ సంఘాల నాయకులు మండిపడుతున్నారు.



ప్రత్యేక అలంకరణలో ఖాద్రీశుడు



సామూహిక వరలక్ష్మి వ్రతంలో పాల్గొన్న మహిళలు

సామూహికం.. శుభ సంకల్పం

కదిరి టౌన్: శ్రావణ శుక్రవారం ఖాద్రీశుని ఆలయం సామూహిక వ్రతాలతో కళకళలాడింది. భారీగా తరలివచ్చిన మహిళలు వరములివ్వు తల్లీ అంటూ వరలక్ష్మిని వేడుకున్నారు. శుక్రవారం స్థానిక లక్ష్మీనరసింహస్వామి దేవాలయ ప్రాంగణంలో సామూహిక వరలక్ష్మీ వ్రతం వైభవంగా జరిగింది. తొలుత అర్చకులు ఖాద్రీ లక్ష్మీ నరసింహస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో సామూహిక వరలక్ష్మి వ్రతం నిర్వహించారు. వేలాదిగా తరలివచ్చిన మహిళలు వ్రతాన్ని ఆచరించారు.

క్లుప్తంగా

పోలీసు కుటుంబాల సంక్షేమానికి కట్టుబడి ఉన్నాం : ఎస్పీ



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ రత్న

పుట్టపర్తి టౌన్: వివిధ కారణాలతో చనిపోయిన పోలీసులకు సంబంధించి ఆయా కుటుంబాల సంక్షేమానికి కట్టుబడి ఉన్నామని, సమస్యలు ఏవైనా ఉంటే నేరుగా తన దృష్టికి తీసుకువస్తే పరిష్కరిస్తానని ఎస్పీ రత్న పేర్కొన్నారు. పోలీస్ శాఖలో పనిచేస్తూ వివిధ కారణాలతో మరణించిన ఉద్యోగుల కుటుంబ సభ్యులతో శుక్రవారం డీపీఓలోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో ఎస్పీ సమావేశమై మాట్లాడారు. సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనారోగ్యం బారిన పడి కొందరు, ప్రమాదాల వల్ల మరికొందరు... ఇలా 11మంది ఉద్యోగులను కోల్పోవడం బాధాకరమని పేర్కొన్నారు. కుటుంబంలో పెద్ద దిక్కును కోల్పోతే వారి పరిస్థితి ఎంత దారుణంగా ఉంటుందో అర్థం చేసుకోగలమన్నారు. ప్రభుత్వం తరఫున కొన్ని బెనిఫిట్స్‌ను ఇప్పటికే అందించామని, ఇంకా అందాల్సిన వాటిని త్వరలో మంజూరు అయ్యేలా చేస్తామన్నారు. ఉద్యోగ విరమణ పొందిన కుటుంబాలు 23 ఉన్నాయని వారికి కూడా ప్రభుత్వం నుంచి బెనిఫిట్స్ త్వరగా అందిచేలా చూస్తామన్నారు. కార్యక్రమంలో ఏఆర్ డీఎస్పీ విజయకుమార్, ఏఓ సుజాత, తదితరులు పాల్గొన్నారు.

కొడికొండలో ఇంటికి నిప్పు



కాలిపోయిన ఇంటి వాకిలి

చిలమత్తూరు: మండలంలోని కొడికొండలో గురువారం రాత్రి వైఎస్సార్‌సీపీ కార్యకర్త ముస్తు సోదరుడు మజీద్ ఇంటికి గుర్తుతెలియని వ్యక్తులు నిప్పు పెట్టారు. అయితే వాకిలికి మాత్రమే మంటలు రాజుకుని ఆరిపోయాయి. దీంతో పెను ప్రమాదం తప్పింది. కాగా, నిప్పు పెట్టిన సమయంలో ఇంట్లో ఎవరూ లేరు. ఈ విషయాన్ని గుర్తించే దుండగులు అఘాయిత్యానికి పాల్పడినట్లు తెలుస్తోంది. కాగా, ఈ ఘటనపై తమకు ఎలాంటి ఫిర్యాదు అందలేదని, అయితే విషయం తెలిసిన వెంటనే అక్కడికెళ్లి పరిశీలించినట్లు ఎస్ఐ మునీర్ అహమ్మద్ తెలిపారు. ఇలాంటి చర్యలు శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తాయని, వ్యక్తిగత కక్షలు ఉంటే మానుకోవాలని గ్రామస్తులను హెచ్చరించినట్లు పేర్కొన్నారు.

'వక్క'లైన బతుకులు

- నష్టాల బాటలో వక్క రైతులు
- దిగుబడులు కొనుగోలుకు ముందుకు రాని వ్యాపారులు



అమరాపురంలోని రైతు ఇంట్లో ఉన్న వక్క నిల్వలు



దేవగానహళ్లిలో సాగులో ఉన్న వక్క తోట



గౌడనకుంటలో ఎండ బెట్టిన వక్క

అమరాపురం: వక్క దిగుబడులకు గిట్టుబాటు ధర లేక రైతులు నష్టాల్లో కూరుకుపోతున్నారు. గతేడాది క్వింటా రూ.65 వేలు చొప్పున ఇంటి వద్దనే వక్క దిగుబడులను రైతులు విక్రయించారు. అప్పట్లో రైతులపై ఎలాంటి అదనపు భారం మోపకుండా వ్యాపారులు, దళారులే తోటల వద్దకెళ్లి దిగబడులు కొనుగోలు చేశారు. ఈ ఏడాది ఇంత వరకూ ధర నిలకడగా లేక పోవడంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. జిల్లాలోనే వక్క ఉత్పత్తిలో మడకశిర నియోజకవర్గం అగ్ర స్థానంలో ఉంది. ఇందులోనూ అమరాపురం మండలంలో అత్యధికంగా రైతులు వక్క సాగుపైనే ఆధారపడి జీవిస్తున్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా 8 వేల ఎకరాల్లో వక్కతోటలు ఉండగా.... ఒక్క అమరాపురం మండలంలోనే దాదాపు 5 వేల ఎకరాల్లో వక్కసాగులో ఉండడం విశేషం. గతంలో ఎన్నడూ లేని విధంగా ఈ ఏడాది గిట్టుబాటు ధర లేక వక్క రైతులు నష్టాలు చవి చూస్తున్నారు.

ఆశలు అడియాసలే..

గత ఏడాది వక్క ధర ఆశాజనకంగా ఉన్నా... మరింత పెరిగే అవకాశముందంటూ చాలా మంది రైతులు వక్క దిగుబడులు విక్రయించకుండా ఇళ్లలోనే బస్తాల్లో నిల్వ చేసి ఉంచారు. అయితే ఇందుకు భిన్నమైన పరిస్థితులు ఎదురు కావడంతో ఆయా రైతులు దిక్కుతోచని స్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు. మరికొందరు రైతులు తమ తోటలతో పాటు ఇతర రైతుల తోటలను కొనుగోలు చేసి పచ్చి వక్కను సేకరించి ఎండబెట్టి బస్తాల్లో నింపి వ్యాపారుల కోసం ఎదురు చూస్తున్నారు. అయితే కొనుగోలు దారులు ఎవరేకానీ ఇటువైపు కన్నెత్తి చూడక పోవడంతో వక్క నిల్వలు పేరుకుపోయాయి.

మడకశిర నియోజకవర్గంలో వక్కతోటల విస్తీర్ణం	8 వేల ఎకరాలు
గత ఏడాది వక్క ధర (క్వింటా)	రూ.65 వేలు
ఈ ఏడాది మార్చిలో వక్క ధర (క్వింటా)	రూ.56 వేలు

పెరుగుతున్న వడ్డీల భారం..

వక్క దిగుబడులకు ఈ ఏడాది ధరలు ఆశాజనకంగా ఉంటాయనుకున్న రైతుల అంచనాలు తలకిందులయ్యాయి. దీంతో బ్యాంక్‌ల్లో బంగారం తాకట్టు పెట్టి రుణం తీసుకుని ఇతర రైతుల తోటల్లో ఫలసాయం కొనుగోలు చేసిన రైతులు దిక్కుతోచని పరిస్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు. అప్పులకు వడ్డీల భారం పెరుగుతోంది తప్ప.. వక్క ధర ఇసుమంత కూడా పెరగడం లేదని రైతులు వాపోతున్నారు. ప్రస్తుతం ఎండిన వక్కలను సంచుల్లో నింపి ఇళ్లలోనే నిల్వ చేసుకున్నామంటున్నారు. గత ఫిబ్రవరి, మార్చి నెలలో క్వింటా రూ.56 వేల వరకు ధర పలికిందని, అనంతరం సార్వత్రిక ఎన్నికలు రావడంతో చాలా మంది తాము పండించిన వక్క పంటను అలాగే నిల్వ చేసి ఉంచారని తెలిపారు. ధర కోసం వేచి చూడడం తప్ప మరో మార్గం లేకపోయిందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గత ఏడాది క్వింటా రూ.65 వేలు చొప్పున తోటల వద్దనే విక్రయించామని, ప్రస్తుతం రూ.56లు చొప్పున అడుతున్నారని తెలిపారు. ఈ ధరతో విక్రయిస్తే రూ.లక్షల్లో నష్టపోవాల్సి ఉంటుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

రూ.10 లక్షలు నష్టపోతా



వక్క ధర నిలకడగా లేదు. గతంలో ఎన్నడూ లేనంతగా ఈసారి క్వింటాపై రూ.10 వేల వరకు ధర తగ్గింది. నాకున్న రెండకరాల తోటతో పాటు ఇతర రైతుల నుంచి పంట కొనుగోలు చేశా. మొత్తం 75 క్వింటాళ్ల వక్క ఇంట్లోనే ఉండిపోయింది. ప్రస్తుతం మార్కెట్లో క్వింటా రూ.45 వేలు చొప్పున అడుగుతున్నారు. ఈ లెక్కన పంట అమ్మితే వడ్డీతో కలుపుకుని రూ.10 లక్షలు నష్టపోవాల్సి వస్తుంది.

– మారుతి, రైతు, తమ్మడేపల్లి, అమరాపురం మండలం

ప్రభుత్వం ఆదుకోవాలి



ప్రస్తుతం మార్కెట్లో వక్క ధర బాగా తగ్గింది. కూలీల ఖర్చులు లెక్కిస్తే రైతులకు మిగిలేదంటూ ఏదీ ఉండదు. గతేడాది పండిన వక్కను ధర లేక ఇంట్లోనే నిలువ ఉంటా. మొత్తం 25 క్వింటాళ్లు అలాగే ఉండిపోయాయి. ప్రస్తుతం అమ్మకానికి పెడితే క్వింటా రూ.45 వేలు అంటున్నారు. ప్రభుత్వం ఆదుకోవాలి. గిట్టుబాటు ధరతో రైతుల నుంచి నేరుగా వక్క దిగుబడులు కొనుగోలు చేయాలి.

– మల్లికార్జున, రైతు, గౌడనకుంట, అమరాపురం మండలం

ఎవరూ రావడం లేదు



నేను 5 ఎకరాల్లో వక్క తోటను సాగు చేశాను. గతేడాది రూ.15లక్షలతో మొత్తం ఫలసాయాన్ని వ్యాపారికి అమ్మేశా. బయటి మార్కెట్‌లో వక్కకు సరైన ధర లేకపోవడంతో ఈ ఏడాది కొనుగోలు చేసేందుకు ఇప్పటి వరకూ వ్యాపారులు ఎవరూ రాలేదు. ఇతర దేశాల నుంచి వక్క దిగుమతులు కాకుండా కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటే దేశీయ రైతులకు ఎంతో వెసులుబాటుగా ఉంటుంది.

– నాగేగౌడ, రైతు, దేవగానపల్లి, అమరాపురం మండలం

మహాసమాధిని దర్శించుకున్న ధర్మస్థల ధర్మాధికారి



సత్యసాయి మహాసమాధి వద్ద పూలహారాన్ని సమర్పిస్తున్న వీరేంద్ర హెగ్డే

ప్రశాంతి నిలయం: సత్యసాయి మహాసమాధిని కర్ణాటకలోని ప్రముఖ శైవ క్షేత్రమైన ధర్మస్థలం ధర్మాధికారి వీరేంద్ర హెగ్డే శుక్రవారం సందర్శించి, మొక్కులు తీర్చుకున్నారు. శుక్రవారం ఉదయం ప్రశాంతి నిలయానికి చేరుకున్న ఆయనను సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ఆర్.జె.రత్నాకర్‌రాజు, సభ్యుడు మనోహర్‌శెట్టి ఆదరంగా స్వాగతించారు. అనంతరం ఆయన సాయికుల్వంత్ సభా మందిరానికి చేరుకున్న సత్యసాయి మహాసమాధిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయనను ట్రస్ట్ తరఫున ఘనంగా సత్కరించారు.

ఉద్యోగాల పేరుతో డబ్బు వసూలు

ధర్మవరం రూరల్: ప్రభుత్వ ఉద్యోగాలు ఇప్పిస్తానంటు నమ్మబలికి నిరుద్యోగుల నుంచి డబ్బు వసూలు చేస్తున్న ఉపేంద్ర అనే వ్యక్తిని శుక్రవారం నిరుద్యోగులు బంధించి ధర్మవరం టూటౌన్ పోలీసులకు అప్పగించారు. బాధితులు తెలిపిన మేరకు... వైఎస్సార్ జిల్లా కడపకు చెందిన వడ్డే ఉపేంద్ర ధర్మవరంలోని మారుతీ నగర్‌కు చెందిన బీటెక్ విద్యార్థి నరేష్‌తో పరిచయం పెంచుకున్నాడు. తనకు ప్రభుత్వ అధికారులు, రాజకీయ నాయకులు తెలుసునని ఉద్యోగం ఇప్పిస్తానని చెప్పి నరేష్ నుంచి రూ.1.50 లక్షలు వసూలు చేశాడు. డబ్బు తీసుకున్న అనంతరం ఫోన్ స్విచ్ ఆఫ్ చేసి అందుబాటులో లేకుండా పోయాడు. ఈ క్రమంలో శుక్రవారం ఉదయం ధర్మవరం రైల్వే స్టేషన్ వద్ద ఉన్న ఉపేంద్రను గుర్తించిన బాధితుడు నరేష్ వెంటనే తన బంధువుల సాయంతో బంధించి పోలీసులకు అప్పగించాడు. తనతో పాటు మరో 20 మందిని ఉపేంద్ర మోసగించి డబ్బు తీసుకున్నాడని బాధితుడు తెలిపాడు. ఉపేంద్రను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారణ చేస్తున్నారు.

తల్లీబిడ్డను కాపాడాల్సిన బాధ్యత వైద్య సిబ్బందిదే..



మాతాశిశు మరణాలపై సమీక్షిస్తున్న డీఎంహెచ్ఓ డాక్టర్ మంజువాణి

ప్రశాంతి నిలయం: సరైన జాగ్రత్తలు పాటిస్తూ సురక్షిత ప్రసవం జరిగేలా చేయడంతో పాటు తల్లీబిడ్డను కాపాడాల్సిన బాధ్యత సంబంధిత వైద్య సిబ్బందిదేనని డీఎంహెచ్ఓ డాక్టర్ మంజువాణి అన్నారు. శుక్రవారం తన కార్యాలయంలో నిర్వహించిన మాతాశిశు మరణాలపై జిల్లా స్థాయి సబ్‌కమిటీ సమావేశంలో ఆమె మాట్లాడారు. జూలై నెలలో జిల్లా వ్యాప్తంగా ఒక మాతృ, ఆరు శిశు మరణాలు సంభవించాయన్నారు. మరణం సంభవించినప్పుడు అందులోని లోపాలను తెలుసుకుని సరిదిద్దుకోవాలన్నారు. మరోసారి మరణాలు పునరావృతం కాకుండా చూసుకోవాలన్నారు. ప్రతి నెల 9వ తేదీన పీహెచ్‌సీల్లో నిర్వహించే ప్రధాన మంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ కార్యక్రమంలో భాగంగా గర్భిణులతో గ్రూపు సమావేశాలు నిర్వహించి తీసుకోవాల్సిన జాగ్రత్తలపై చైతన్య పరచాలన్నారు. కార్యక్రమంలో డీసీహెచ్ఎస్ డాక్టర్ తిప్పేంద్రనాయక్, డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ సెల్వియా సాల్మన్, జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి డాక్టర్ నాగేంద్ర నాయక్, గైనాకాలజిస్ట్ డాక్టర్ అస్తరున్నీస్సా, పీడియాట్రీషియన్ డాక్టర్ సాయికుమార్, తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తిని ఢీకొన్న ఎమ్మెల్యే గుమ్మనూరు కారు



తీవ్రంగా గాయపడిన నాసిర్

చిలమత్తూరు: గుంతకల్లు టీడీపీ ఎమ్మెల్యే గుమ్మనూరు జయరాం కారు ఢీకొని ఓ యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. పోలీసులు తెలిపిన మేరకు... శుక్రవారం హిందూపురం వైపు నుంచి వస్తున్న గుమ్మనూరు జయరాం కారు చిలమత్తూరు మండల పరిధిలోని 544ఈ జాతీయ రహదారి చేనేపల్లి క్రాస్ వద్ద శరవేగంగా వెళుతూ ద్విచక్ర వాహనాన్ని ఢీకొంది. ఘటనలో ద్విచక్ర వాహనంపై వెళుతున్న హిందూపురం నివాసి, ఎలెక్ట్రీషియన్ నాసిర్ బాషాకు తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రుడిని వెంటనే హిందూపురంలోని జిల్లాస్పత్రికి తీసుకెళ్లారు. పరిస్థితి విషమంగా ఉండడంతో బెంగళూరుకు తరలించారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు. కాగా, ప్రమాదం జరిగినప్పుడు కారులో ఎమ్మెల్యే లేరని తెలిసింది.

బీసీలపై వేధింపులు ఆపాలి

- మాజీ మంత్రి ఉషశ్రీ చరణ్



విలేకరులతో మాట్లాడుతున్న ఉషశ్రీ చరణ్

పెనుకొండ రూరల్: బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవితమ్మ సొంత నియోజకవర్గంలోనే బీసీలపై దాడులు జరుగుతుండడం బాధాకరమని, వెంటనే దాడులు ఆపాలని మాజీ మంత్రి ఉషశ్రీ చరణ్ అన్నారు. పెనుకొండ మండలం కొండంపల్లి, శెట్టిపల్లి గ్రామాల్లో శుక్రవారం ఆమె పర్యటించారు. అనారోగ్యంతో బాధపడుతూ చికిత్స అనంతరం ఇంట్లో విశ్రాంతి తీసుకుంటున్న కొండంపల్లి మాజీ గృహ సారథి రమణారెడ్డిని పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం కార్యకర్తలతో సమావేశమై మాట్లాడారు. పార్టీ భవిష్యత్తు కార్యాచరణను వివరించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ.. మంత్రి సవితమ్మ సొంత పంచాయతీ రాంపురంలో బీసీలపై వేధింపులు తారాస్థాయికి చేరుకున్నామని మండిపడ్డారు. ఎన్నికల ప్రచారంలో చంద్రబాబు ఇచ్చిన హామీ మేరకు బీసీలకు 50 ఏళ్లకే పింఛన్ అందజేయాలని డిమాండ్ చేశారు. సూపర్ సిక్స్ పథకాలను చూస్తే భయమేస్తోందని సీఎం చంద్రబాబు పేర్కొనడం హాస్యాస్పదంగా ఉందన్నారు. మూడు ఉచిత గ్యాస్ సిలిండర్ల పథకంపై మంత్రి నాదెండ్ల మనోహర్ సైతం పునరాలోచించాలని అనడం సిగ్గు చేటన్నారు. మోపిదేవి వెంకటరమణ, బీద మస్తాన్ వంటి ప్రజాప్రతినిధులను ప్రలోభాలకు గురి చేసి టీడీపీలోకి చేర్చుకోవడం ద్వారా బీసీల మనోభావాలను చంద్రబాబు దెబ్బ తీశారని మండిపడ్డారు. కార్యక్రమంలో సింగిల్ విండో మాజీ అధ్యక్షుడు కృష్ణారెడ్డి, ఎంపీటీసీ శివయ్య, కౌన్సిలర్లు సుధాకర్‌రెడ్డి, గణప్ప, యాసిన్, శేషాద్రి, సద్దాం, నాయకులు గోపాల్ రెడ్డి, వెంకటేష్, శ్రీకాంత్‌రెడ్డి, శ్రీరామిరెడ్డి, ఆదినారాయణ, ప్రసాద్, సాయిరాంనాయక్, శ్రీధర్‌నాయక్, సోమశేఖర్, మదన్‌మోహన్‌రెడ్డి, కేశవ, ఆంజనేయులు, నరసింహులు, తదితరులు పాల్గొన్నారు.

మహిళా రైతుపై దాడి.. నగల అపహరణ



బాధితురాలు తిమ్మమణి

రొళ్ల: పొలంలో గడ్డి కోస్తున్న మహిళా రైతుపై దుండగులు దాడి చేసి విలువైన బంగారు నగలను అపహరించుకెళ్లారు. పోలీసులు తెలిపిన మేరకు... రొళ్ల మండలం జీబీ హళ్లికి చెందిన మంజునాథ్, తిమ్మమణి వ్యవసాయంతో పాటు కూలి పనులతో జీవనం సాగించేవారు. మంజునాథ్ మృతి అనంతరం తిమ్మమణి పాడి పోషణ చేపట్టింది. శుక్రవారం ఉదయం తమ పొలంలోని షెడ్డులో ఉన్న ఆవులను ఆరుబయలులో కట్టేసి, మేతను తీసుకొచ్చేందుకు పొలానికి వెళ్లింది. అప్పటి వరకూ ఆమె కదలికలను గమనిస్తూ వచ్చిన ఇద్దరు వ్యక్తులు ఒక్కసారిగా దాడి చేశారు. మెడలో ఉన్న బంగారు గొలుసుతో పాటు చెవులకు వేసుకున్న జత కమ్మలను బలవంతంగా లాగారు. ఆ సమయంలో ఆమె కేకలు వేయడంతో కర్రతో తలపై బాదారు. కమ్మలను బలంగా లాగడంతో చెవితమ్మలు తెగిపోయాయి. దాదాపు రూ.4 లక్షలకు పైగా విలువైన 6 తులాల బంగారు నగలను అపహరించుకెళ్లారు. విషయం తెలుసుకున్న చుట్టు పక్కల పొలాల్లోని రైతులు, కుటుంబసభ్యులు వెంటనే ఆమెను రొళ్ల పీహెచ్‌సీకి తీసుకెళ్లి చికిత్స చేయించారు. మెరుగైన వైద్యం కోసం మడకశిరలోని ప్రభుత్వాస్పత్రికి వైద్యులు రెఫర్ చేశారు. విషయం తెలుసుకున్న మడకశిర సీఐ రాజ్‌కుమార్, ఎస్ఐ రాజశేఖర్‌తో కలసి ఘటనా స్థలాన్ని పరిశీలించారు. అపరిచిత వ్యక్తుల కదలికలపై చుట్టు పక్కల గ్రామాల్లో ఆరా తీశారు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు.

న్యాయం చేయాలంటూ స్టేషన్ ఎదుట ధర్నా



కొత్తచెరువు పోలీస్‌స్టేషన్ ఎదుట నిరసన తెలుపుతున్న మృతుడి కుటుంబసభ్యులు

పుట్టపర్తి టౌన్: తన భర్త చావుకు కారణమైన వారిని వెంటనే అరెస్ట్ చేయాలంటూ కుటుంబసభ్యులతో కలసి కొత్తచెరువు మండలం లింగారెడ్డి పల్లికి చెందిన మృతుడు శ్రీరాములు భార్య భారతి శుక్రవారం కొత్తచెరువు పోలీస్ స్టేషన్ ఎదుట ధర్నా చేపట్టింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గురువారం ఉదయం తమ గొర్ల దొడ్డి వద్ద ఉన్న గొర్రె పిల్లల కోసమని గడ్డి మోపును తీసుకెళ్లిన శ్రీరాములు... పాఠశాల ప్రహరీపై ఉంచాడని, అయితే మోపు అవతలి వైపు పడిపోవడంతో తీసుకునేందుకు తన భర్త గోడ దూకాడని గుర్తు చేశారు. ఆ సమయంలో అక్కడ శుభ్రం చేస్తున్న అదే గ్రామానికి చెందిన ఓ మహిళ భయపడి పారిపోయిందన్నారు. అయితే వాస్తవాలు తెలుసుకోకుండా ఆమె కుటుంబీకులు తన ఇంటిపై దాడి చేసి అవమానించడంతో మనస్తాపం చెందిన తన భర్త ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడన్నారు. తన భర్త మృతికి కారణమైన వారిపై వెంటనే కేసు నమోదు చేయాలని డిమాండ్ చేస్తూ సీఐ ఇందిరకు వినతి పత్రం అందజేశారు. సీఐ ఇందిర స్పష్టమైన హామీనివ్వడంతో ఆందోళనను విరమించారు.